# పెళ్ళిభయం

వయసు వచ్చిన ప్రతీవాడినీ అడిగేవిధంగానే నన్నూ అడిగారు మావాళ్ళు పెళ్ళిచేసుకోమని. కాని నాకు మనస్కరించలేదు. స్త్రీ సాహచర్యంతో జీవితాన్ని ముడిపెట్టుకుంటే మగవానికి భవిష్యత్తు లేదని నా అభిప్రాయం. ఈ అభిప్రాయం స్థిరపడ డానికి నా చుట్టూఉన్న వాతావరణం చాలావరకు హేతువంటే అది అబద్ధం కాదు.

మా పెత్తండ్రిగారింట్లో పెండ్లిచూసి, మా దీక్షితులు బాబాయి కుటుంబంతో తిరిగి యింటికి వచ్చేస్తున్నాను. అప్పుడు నాకు పన్నెండు సంవత్సరాలు. అన్నగారిదగ్గర చాలాకాలం నుంచి ఉంటున్న ముసలితల్లి పెళ్ళికిరాగా, కొన్నాళ్ళు తన దగ్గరకూడా ఉండమని, తల్లిని వెంటబెట్టుకుని మా బాబాయి బయలుదేరాడు. బయలుదేరేముందు మా పిన్ని సణుగుడు మొదలుపెట్టింది. "ఉన్న పిల్లలకే చాకిరీ చెయ్యాలేక చస్తూంటే, యీ ముసలిపీనుగులుకూడా నానెత్తిన ఎందుకు!" అని. పెళ్ళము మాటలకు అసలు లోపల భయపడుతున్నా, చాలాకాలంనుంచి తల్లి దూరంగా ఉండడంవల్ల, మాతృప్రేమ కరిగి, భార్యను లెక్కచేయకుండా తల్లిని బండి ఎక్కించాడు బాబాయి. మా ముసలిబామ్మ కోడలు గయ్యాళి అని తెలిసికూడ, చిన్నకొడుకు దగ్గర కొన్నాళ్ళు ఉండాలనే కోరికతో "ఎందుకు, ఎందుకు" అంటూనే బండి ఎక్కింది.

రెండెడ్ల బండి గతుకుల రోడ్డుపై నడుస్తూనేవుంది. మా పిన్ని అత్తగారిమీద తిట్లు విసరడం ప్రారంభించింది. మా ముసలి బామ్మ వినీ విననట్లు మాట్లాడకుండా ఊరుకుంది. తల్లిని పదేపదే తిడుతూంటే, బాబాయి ఊరుకోలేక మా పిన్నిని కూకలేశాడు. 'ఏడాదికి ఒక్కనెలైనా తల్లికి సేవచేయలేనప్పుడు- మీరంతా ఉండి చచ్చినా బ్రతికినా ఒకటే' అంటూ భయం కోపం మిళితమైన కంఠంతో అరిచాడు. మా పిన్ని ఆ కేకలకు చిలవలు పలవలు తగిలించి మా బామ్మని తిట్టింది. పిల్లలిని కొట్టింది.

ఈ పరిస్థితిలో బండి గమ్యస్థానం చేరింది. కృష్ణానది పాయ ఒకటి అడ్డుగా నిలిచింది. అది దాటితే మాఊరు. బండిదిగి యిసుక రేవు చేరాము. నది దాటించే పడవవాడు సిద్ధంగా ఉన్నాడు. నడుస్తూ నడుస్తూ మా పిన్ని హఠాత్తుగా ఆ నది యిసుకతిన్నెలో చతికిలపడి యింటికిరాకుండా ఆ కృష్ణా నదిలో పడి చచ్చిపోతానంది తను యింటికి రావాలంటే, అత్త గారిని తిరిగి పంపివేయమంది. పిన్ని గోలచూసి, మా బాబా యికి నిజంగా కోపం వచ్చింది. భయపడుతూనే కొట్టాడు. ఇంకేముంది ? మా పిన్ని రెచ్చిపోయింది. సివంగిలా జుట్టు విరబోసుకుని కేకలతో తిట్లతో గంతులేయసాగింది. నదిలోకి గబగబా నడిచింది చచ్చిపోతానంటూ. మా బాబాయి ఆమె వెనకాల పరుగెత్తాడు. ఆమెను పట్టుకోడం సాధ్యంకాలేదు. ఈ ఆపద చూసి పడవవాడు నదిలోకి పరుగెత్తి ఆమెను బల

వంతాన రెక్కపట్టుకు లాక్కొచ్చి పడవలో కుదేశాడు. "నన్నెందుకు ముట్టుకుంటావురా దొంగముండాకొడకా" అంటూ గలభాచేసింది మా పిన్ని. మా బాబయ్యకు యీ దృశ్యం యిష్టంలేకపోయినా, తప్పనిసరి అయింది. పడవ నడిచింది. మా పిన్ని గోల మానలేదు. నదిమధ్యలో, గాలిజోరులో, పడవ కుదుపులో, నదిలోపడి చచ్చిపోతానంటూ పడవ అంచుల మీదినుంచి దుముకబోయింది. ఒక్కపట్టు తప్పితే అందరం ఆ నదీగర్భంలో ఉండవలసినవాళ్ళం. నాగుండె బితుకుబితుకుమంది. ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. 'బాబోయి' అన్నా. పడవవాడు చేతిలోని గెడకర్రతో మా పిన్ని నెత్తిమీద బలంగా ఒకటి కొట్టాడు. ఆమె స్పృహతప్పి పడిపోయింది. అప్పటికి మా కొక గండం తప్పింది.

ఆ దృశ్యం యిప్పటికి నాకు మరుపురాదు. ఆ స్త్రీ గయ్యాళితనం మొదటిసారి నా హృదయంలో నాటుకుని ఆడ జాతి అంతా యింతే అనే అభిప్రాయం నాలో కలిగించింది. కాని మా బాబాయి అంటాడు "అది మంచిదేరా, అప్పు డప్పుడు పిచ్చికోపం వస్తుంది గాని" అని. ఆమె మంచితన మేమిటో నాకుమాత్రం అర్థంకాలేదు.

సెలవలకు ఒకసారి మా బావగారి ఊరు వెళ్ళాము. అప్పటికి నాకు పదునాలుగేండ్లు. వయస్సుకుమించి పెరిగాను. అందరూ నాకు పద్దెనిమిది సంవత్సరా లనుకునేవారు. అలాగే మా బావగారి యింటివారుకూడా నన్ను పెద్దమనిషిగా జమ

కట్టారు. మా బావగారింట్లో నూతిదగ్గర స్నానం చేసేవాడిని, ఆ యింటివారి కోడలు మంగళ. పొద్దున పాచిచేస్తూ కనిపిస్తూ ఉండేది. అందంగా ఉబికిన ఆ సిగ్గుబుగ్గలు, రేగిన ముంగురులు, గుండ్రని బంగారు ముఖం, తల వంచుకుని నడిచే ఆ మంద గమనం, నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. నిజంగా అనుకునేవాడిని, అటువంటి భార్య లభించినవాడు అదృష్టవంతుడని. నూతిదగ్గర నేను స్నానం చేస్తూంటే పనిగజాలు గబగబ తల వంచుకుని నడిచి పారిపోయేది. నాకే చాలా సిగ్గు కలిగేది అటు వంటి పరస్త్రీని అనవసరంగా చూస్తున్నందుకు. చాలా అంద మైన అనుకూలమైన గృహిణి అని ఆమెను చూచినవారందరూ అనేవారు.

ఇదే భావం కలిగిన నాకు ఒక నెల తర్వాత విన్న వార్త చాలా ఆశ్చర్యం కలిగించింది - పక్కనే కాపుర ముంటున్న ఒక రెడ్డితో ఆమె లేచిపోయిందని. ఆమెను వెతికి పట్టుకున్నాక, భర్త, తలిదండ్రులు ఆమెను నవ్యంగావచ్చి తిరిగి కాపురం చేసుకోమన్నా 'ససేమిరా' అని ఆ రెడ్డిని వదలక, భీష్మించుకుందని తెలిసింది. అప్పుడే కలిగింది నాకు ఆడది వంచకు రాలు అనే అభిప్రాయం.

అవి నేను కాలేజీలో అడుగుపెట్టిన రోజులు. గోపా లానికి నాకు చాలా స్నేహం కుదిరింది. అతను నాటకాలు బాగా వేస్తాడు. బహుమతులు పొందాడు. నాకు నాటకాలు వేయాలని కుతూహలం ఎక్కువగా ఉండేది. అదే మా యిద్ద

రికీ స్నేహం కుదిర్చి చాలా సన్నిహితంగా తీసుకువచ్చింది. గోపాలాన్ని అందరూ సగౌరవంగా అభిమానంతో చూసేవారు.

అతనికి ఒక అమ్మాయితో సాంగత్యం కలిగింది. ఆమె పేరు లలిత. ఆమె గోపాలం యింటిప్రక్కనే అద్దెకువుంది. అతని నటనాకౌశలాన్ని ఆమె ఎంతో మెచ్చుకునేది. తరుచు వారిద్దరూ ఏదో మిషపై కలుసుకునేవారు.

గోపాలం అన్నాడు ఒకసారి నాతో. ఆమె తన్ను ప్రేమిస్తున్నదని ఆమె సాంగత్యం నిజంగా అతనికి సంతోష కరంగా ఉండేది. కారణం లలిత అందగత్తే కాక డబ్బుగలదికూడ. కావలసిన డబ్బు తండ్రిదగ్గరనుంచి తనకై తెప్పించుకుని గోపాలానికి యిచ్చేది. ప్రేమ, ధనం, అందం అన్నీ కలిసివచ్చిన ఆ స్త్రీని విడవ బుద్ధి పుట్టలేదు గోపాలానికి, పెళ్ళి చేసుకోమన్నాడు. ఆమె ఒప్పుకుందికూడా. వారిద్దరూ ఆనందంగా చాలారోజులు గడిపేశారు. ఆ దినాలు నాకు బాగా తెలుసు. ఒక్కరోజూ ఆమెను చూడకుండా ఉండలేకపోయేవాడు గోపాలం. ఒకవేళ ఆమె కనిపించకపోతే మతిపోయినట్లు ప్రవర్తించేవాడు. యిద్దరూ పరీక్ష తప్పారు. వేసంగి సెలవులకు ఆమె తన వూరు వెళ్ళిపోయింది.

లలిత లేనిదే గడపటం కష్టమనిపించింది గోపాలానికి. పిచ్చివాడిలా గెడ్డం పెంచాడు కొన్నాళ్ళు. ఆమెదగ్గరనుంచి కొన్నాళ్ళు ఉత్తరాలువచ్చి తరువాత ఆగిపోయాయి. తిరిగి కలుసుకోవాలని లలిత వూరు వెళ్ళాడు గోపాలం. ఆమె తండ్రిని

కలుసుకున్నాడు. లలిత నాతనికిచ్చి పెండ్లి చెయ్యమన్నాడు. ఆమెతండ్రి వినలేదు. లలితను ప్రశ్నించాడు గోపాలం గడిచిన దినాలు జ్ఞప్తికితెచ్చి. ఆమె ఎందుకో మౌనం వహించింది. గోపాలానికి అది అర్థంకాలేదు. ఆమె తండ్రి యితనిని పరిహాసించాడు. "ఏం చూసి పిల్ల నిమ్మన్నావు? డబ్బా? చదువా? అందమా?" ఆ ప్రశ్న బాణంలా గుచ్చుకుంది గోపాలం మనస్సులో. నిజం. అతనిలో ఆ మూడూలేవు. ఖిన్నుడై యింటికి తిరిగి వచ్చాడు. మతి పూర్తిగా చెడింది తర్వాత. పిచ్చాసుపత్రిలో అతనిని చేర్చారు. ఆ ప్రమిత్రుని అవస్థ చూచేసరికి నా బాధ కట్టలు తెంచుకుని ప్రవహించింది.

నాకు స్త్రీ గురించి మునుపు కలిగిన అభిప్రాయాన్ని యీ ఘట్టము బాగా బలపరిచింది. ఆడది రాక్షసి. మగవాడిని తన విలాసం ఆనందంకోసం ఆటబొమ్మనుచేసి, ఆడించి, లాలించి, తన సరదాలు తీరాక, అతినిని గడ్డిపరకగా చూస్తుంది.

తరువాత నాకు తెలిసింది, లలిత ఒక యింజనీరును పెళ్ళి చేసుకున్నట్లు. ఎప్పుడో ప్రయాణం చేస్తూంటే ఒకసారి రైల్లో కనిపించింది. నన్ను పలకరించి తన భర్తను పరిచయం చేసింది. కాస్సేపయినాక మెల్లిగా అడిగింది గోపాలం ఎక్కడ? ఏంచేస్తున్నాడు? అని. చెప్పాను 'నీపేరు స్మరించుకుంటూ పిచ్చిఆసుపత్రిలో ఉన్నా'డని. ఆమె కళ్ళల్లో నీరు ఉబికింది కాని దిగమింగుకుంది మరుక్షణంలో. ఆమె భావం ఏమిటో నాకు అర్థంకాలేదు. అడుగుదామనుకుంటే అవకాశం లేకపోయింది.

స్త్రీపట్ల అటువంటి అసహ్యం నాలో పునాదులు వేసుకున్నప్పుడు, నాకు వయసు రావడం, నా పెళ్ళిసంగతి కదపడం జరిగింది. అందువల్ల పెళ్ళి అంటే నాకు చెప్పరానిబాధ కలిగింది.

చిన్నప్పుడు తండ్రి చనిపోతే అప్పటినుంచి మాఅన్నయ్యే నన్ను పెంచి పెద్దచేసి చదువు చెప్పించాడు. అందుచేత నేను సమాధానం యిచ్చాను. 'నేను అస్వతంత్రుణ్ణి, డబ్బులేదు. కనుక భార్యను పోషించలేను. అందుచేత పెళ్ళివద్దు' అని. ఈ కారణం మావాళ్ళకు సబబుగా కనిపించలేదు. 'డబ్బులేకపోతే సంపాదించుకోడానికి చాలా జీవితం ముందుంది. కాని యౌవనం జారిపోతే తిరిగి సంపాదించుకోలేవు' అని నీతి బోధించారు! అది నా చెవికెక్కలేదు.

అయినా చదువు పూర్తికావాలని మరోసాకు అడ్డు వేశాను. చదువయినాక ఉద్యోగం దొరకాలని మరో వంక బెట్టాను. ఉద్యోగం దొరికాక, యింట్లో ఎదిగిఉన్న మా రెండో చెల్లెలి పెండ్లి ముందుకావాలి అని మరో మిష బెట్టాను. నా చెల్లెలి పెళ్ళికూడా అయిపోయింది. నాకు యింకేవంక దొరకలేదు. తప్పనిసరిగా సంబంధాలు చూస్తూ ఏదీ నచ్చలేదనేవాణ్ణి. మా వాళ్ళకు నా తత్త్వం అర్థంకాలేదు. నేను ఎందుకు పెళ్ళి చేసుకోనన్న అనుమానమే వారిని పీడించింది. కాని నేను మాత్రం, పెరిగిన స్త్రీ ద్వేషంతో, మనోనిగ్రహంతో, పాతిక సంవత్సరాల వయస్సుదాకా రోజులు దొర్లించాను.

మా అన్నయ్య చెబితే ఒకరోజు మా వదినెను సాయంగా వెళ్ళాను సినీమాకు. విశ్రాంతి సమయంలో లైట్లు వెలిగాయి.

"లక్ష్మీ! లక్ష్మీ!"

వెనకనుంచి కేక వినబడింది. మా వదినె వెనక్కి తిరిగి చూసింది నేనూ చూశాను.

నీలిరంగు సిల్కుచీర ... ఆకుపచ్చ సిల్కుజాకట్టు - తాంబూలంతో ఎర్రబడిన పెదాలు ... గండుతుమ్మెదలలా పెద్దకళ్ళు - బంగారు ఛాయ - బాణాకారపు నుదురుపై ఎగిరే ముంగురులు సరిచేసుకుంటూ చేయి ఆడించింది ఆమె సంతోషంగా. మా వదినెముఖం ఆనందంతో వెల్లివిరిసింది.

"ఓ సావిత్రి!"

అంటూనే మా వదినె వెళ్ళి ఆమెప్రక్క ఖాళీగాఉన్న కుర్చీమీద కూర్చుంది.

దూరాన్నుంచి వింటున్నాను. వారిద్దరిమధ్యా ఏవో చాలా రహస్యాలు నడిచాయి. మా వదినె రమ్మంటే నేను కూడా వెళ్ళి వాళ్ళప్రక్కనే కూర్చున్నాను.

సినీమా అయినాక మా వదినె అంది.

"ఇతను మా మరిది" అంటూ సావిత్రికి, ఆమె భర్తకు పరిచయం చేసింది నన్ను. నేనొక నమస్కారం పెట్టాను.

"పెళ్ళయిందా" అన్నాడు ఆయన చిరునవ్వుతో. ఆ నవ్వులోమాత్రం ఆయన చాలా సుఖపడుతున్న సంసారిలా కనిపించాడు.

"పెళ్ళిచేసుకోనని ప్రతినపట్టిన భీష్ముడులెండి మావాడు" అంటూ ఎగతాళిచేసింది మా వదినె. అందరూ నన్నుచూసి ఫకాలున నవ్వారు. నా కేమనాలో అర్థంకాక తల వంచుకు మామూలుగా నడిచాను.

సావిత్రి, మా వదినె చిన్ననాటి స్నేహితులు. ఆమెకు నా వయసే వుంటుంది. సావిత్రి భర్త స్కూళ్ళ యినస్పెక్టరు. బదిలీమీద యీ వూరువచ్చి మూడు నెలలయింది. తరువాత తరుచు నేనూ మా వదినె సావిత్రిగారింటికి వెళ్ళేవాళ్ళము. ఒక్కొక్కసారి మా వదినె నన్ను బలవంతంగాకూడా తీసుకు వెళ్ళేది. చనువు బాగా పెరిగాక ఆమెను నేను సావిత్రమ్మ అని పిలిచేవాడిని. మా వదినె, ఆమె, నన్నుచూసి ఏవో గుసగుస లాడుకుని, కిలకిల నవ్వుకునేవారు.

కొన్నిరోజులు గడిచాయి. సావిత్రమ్మ ప్రవర్తనలో చాలా మార్పులు కనిపించాయి. నేను కనిపిస్తే చిలిపిగంతులు వేసేది. కిలకిలా నవ్వేది. నోటికివచ్చినట్లు వేళాకోళం చేసేది. ఇంటికి వెడితే ఏదోఒకటి తినడానికి పెట్టేది. అస్తమానూ నా దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేది.

ఆమె ప్రవర్తనలోని మార్పులు, పాతికేళ్ళు వచ్చినా పిల్లలులేక బలిష్టమై అందంపిడని ఆమె శరీరం; నా భావాలలో ఒక విచిత్రమైన మార్పు తెచ్చాయి. నాలో ఏవో బలవత్తర మైన కోర్కెలు ఏర్పడ్డాయి.

తరుచు ఆమె యింటికి ఒంటరిగా వెళ్ళేవాడిని. ఒంటి మీద చెయ్యివేస్తే ఆమె ఊరుకునేది. నాలో కోర్కెలు పెరిగాయి.

ఒకరోజు పార్కుకు వెళ్ళాము నేనూ, మా వదినె, ఆమెతో కలిసి. ఒక పూపొదదగ్గర కూర్చున్నాము. సావిత్రిమ్మ నాకేసి చూసి ఫకఫకా నవ్వింది.

"ఎందుకు నవ్వుతారు?" అన్నా.

"మిమ్మలిని ఒక ప్రశ్న వేస్తాను. కోపం రాదుకదా?"

"రాదు చెప్పండి."

"మీరు పెళ్ళి ఎందుకు చేసుకోరూ?"

నాకు నిజంగా కోపం వచ్చింది ముఖం జేవురించింది. నాకు చనువిచ్చిన పరస్త్రీ యిటువంటి ప్రశ్న వేస్తే అర్థం ఏమిటి? నన్ను ఎగతాళి చేసినట్లనిపించింది. చాలా బాధపడ్డాను. కాని మాట్లాడలేదు.

"మాట్లాడరేం. కోపం వచ్చిందా?"

"లేదు.

మావదినె నాకేసి తదేకధ్యానంతో చూస్తూ వింటోంది.

"మరి, ఎందుకు చేసుకోరూ?"

ఏమీ చెప్పలేకపోయాను, లోపల బాధవల్ల.

"చదువు లేదనా?"

"లేదు."

"చదివిన బి. ఏ. చాలదా?"

"నాకన్న ఎంతో ఎక్కువ చదువుకున్నవాళ్ళున్నారు."

"ఆశకు అంతేముంది ?"

సమాధానం చెప్పలేకపోయాను.

"డబ్బు లేదనా ?"

"లేదు. తెచ్చే రెండువందల జీతం నా ఖర్చుకు చాలదు. భార్యనెలా పోషించగలను ?"

"కానీ గడించలేని ముష్టిదంపతులుకూడా ఆనందం అనుభవిస్తున్నారు."

ఎదురుమాట చెప్పలేకపోయాను.

"అందం లేదనా ?"

"కాదు."

"నా కళ్ళతో నేను చూడటంలేదూ?"

ఆమెకేసి నిదానించి చూశాను. నవ్వింది. నేను లోలోపల సంతోషించాను, నన్ను అందగాడిగా భావించే స్త్రీ ఒకతైనా ఉందికదా అని.

తిరిగి మౌనం నాలో.

నా మౌనం ఆమెకు కోపం తెప్పించింది.

"పిల్లలు పుట్టరని భయమా ?" గర్జించింది ఆమె కోపంతో.

ఆ ప్రశ్న నా గుండె ఛేదించింది. మనోనిగ్రహంతో వయస్సులో పెండ్లి చేసుకోకపోతే నపుంసకుడిగా భావించే సంఘంకూడా ఉంటుందన్నమాట. ఆమెకు పిల్లలు లేకపోవడం వల్ల ఆ మాటల్లో నాకు ద్వంద్వార్థం స్ఫురించింది.

నాలో భరింపరాని ఆవేదన కలిగి వెక్కి వెక్కి ఏడ్చాను. నా ఏడ్పు చూసి ఆమెకు జాలి బాధ కలిగాయి. మా వదినె ఆశ్చర్యపోయింది. నేను ఏడ్వటం మునుపు ఎప్పుడూ ఆమె ఎరుగదు.

"మరి చెప్పరూ? చెప్పకపోతే నే చచ్చినంత ఒట్టు" అంటూ ఆమె నన్ను అనునయించింది. మా వదినెకూడా అదే ఒట్టు పెట్టుకుంది.

కాని ఏం చెప్పను? ఏముంది చెప్పడానికి? నాకు స్త్రీ అంటే ఏదో చెప్పలేని అసహ్యం కాక మరేమీలేదు. కాని స్త్రీలోకం నన్ను అపార్థం చేసుకోడం నాకు యిష్టం లేక పోయింది.

గోపాలం జీవితంలో జరిగిన విషాదగాథ నాగాథగా వర్ణించి వారితో చెప్పాను. "ఆమె పెళ్ళిచేసుకోకపోవడంవల్ల స్త్రీ అంటే నాకు అసహ్యం, విరక్తి కలిగింది. అంచేత నేను ఏ స్త్రీని యికముందు పెళ్ళిచేసుకోలేను...వయస్సులో ఒక్కొక్క సారి మనస్సు చలించి కొన్ని పొరపాట్లు చేస్తాము...కాని యికముందు చాలా జాగ్రత్తగా ఉంటాను" అంటూ ఆమెను ఉద్దేశిస్తూ పశ్చాత్తాపంతో నిట్టూర్చాను.

సావిత్రిమ్మ జాలిగా నాకేసి చూసింది. ఆమెకళ్ళు చెమ్మగిల్లాయి.

"యీ చిన్నవిషయంకోసం పెళ్ళి మానేస్తారా? మంచి ఆడవాళ్ళు ఎంతమంది లేరు యీ ప్రపంచంలో."

"ఏమైనా సరే నే పెళ్ళి చేసుకోను" అంటూ నిశ్చయంతో చెప్పాను.

అక్కడితో ఆ సంభాషణ ముగిసింది.

ఆ నాటినుంచి సావిత్రమ్మ నాకు మరీ చనువు యిచ్చింది. నే నణచుకున్న కోర్కెలు నాలో తిరిగి చెలరేగాయి.

ఒకరోజు మాటలసందర్భంలో 'మా వారు వూళ్ళో లేరు నాల్గురోజులదాకా రారు. నువ్వువచ్చి యిక్కడ పడుకో కూడదమ్మా లక్ష్మీ!' అంటూ మా వదినె నుద్దేశిస్తూ నాకేసి సావిత్రమ్మ అదోపిధంగా చూసింది.

నేను మొదట గాభరాపడ్డాను. కాని మనసు దిటవు చేసుకున్నాను.

మా వదినె రావడానికి వీలుండదని చెప్పేసింది.

రెండో ఆట సినీమాకి వెళ్ళివస్తూ, సావిత్రమ్మ తలుపు తట్టాను ఆ రాత్రి తలలో ఎన్నో ఆలోచనలు పరుగులెత్తాయి. అవసరమైతే సావిత్రమ్మను ఏదోవిధంగా పెళ్ళి చేసుకోవాలనే నిశ్చయానికికూడ వచ్చేశాను.

తలుపుశబ్దం విని, ఆమె లేచివచ్చి కిటికీ రెక్కలు తీసింది.

"మీరా?"

"సినీమాకి వెళ్ళివస్తూ, మిమ్మలిని చూద్దామని వచ్చాను" అంటూ భయంతో నసిగాను.

"రేపు రండి. చూడవచ్చు" అంటూ కిటికీ తలుపులు ఛట్మన వేసింది ఆమె.

నాకు చెప్పరాని కోపం వచ్చింది. వలచి వలపించి, పలికి పలికించి, నవ్వి నవ్వించి కవ్వించిన స్త్రీ యిలాచేస్తే ఏమను కోవాలి? నన్నొక ఆటబొమ్మనుగా చేసిందనే ఉక్రోషం నాలో పెరిగింది.

మర్నాడు మా వదినె నన్ను సావిత్రిమ్మగారింటికి రమ్మంది. నాకు తప్పనిసరి అయింది. యింట్లో మరెవరూ లేక పోవడంవల్ల. మా వదినెతో ఆమె క్రితం రాత్రి జరిగిన విషయం చెబుతుందేమో అని భయపడుతూనే వారింటికి వెళ్ళాను.

ఇంట్లో అడుగు పెట్టగానే సావిత్రిమ్మ నన్ను చూసి మామూలుగా నవ్వుతూ స్వాగతమిచ్చింది. కొంత భయం తగ్గింది నాకు. కాని మరుక్షణంలో మా వదినె, ఆమె, గుసగుస లాడుకున్నారు. నా ప్రాణాలు నిలువునా పోయాయి. మా వదినె నవ్వుతూ బయటికి వచ్చింది. నేను తమాయించు కున్నాను. ఇంతలో మూడుకప్పుల కాఫీ యింట్లోంచి తెచ్చింది సావిత్రిమ్మ.

కాఫీ త్రాగుతున్నాం. ఆమె నాకేసి నిదానంగా ఒక సారి చూసి నవ్వింది.

"మీ విషయంలో ఒక అపచారం చేశాను" అంది. సరిగ్గా ఆ మాట నేననవలసినది. కాని ఆమె అనడంవల్ల, ఆ మాటలో నాకు అనేక అర్థాలు స్ఫురించాయి. అయినా ఆ విషయం మా వదినె ఎదురుగా కదుపుతోందేమో అని నాకు నాకు ఆశ్చర్యం కలిగింది

"మీ మనోనిగ్రహం పరీక్ష చేశాను."

ఆమాట వినగానే, నేను వెఱ్ఱిమొహం వేశాను.

మా వదినె ఫక్కున నవ్వింది, యీ నాటకంలో తనూ
ఒక పాత్రధారినని వ్యక్తంచేస్తూ.

ఆమె మౌనంగా మందహాసం చేసింది. ఆ మందహాసంలో
ఎన్నో అందాలు తొణికిసలాడాయి. అది మరుపురాని తీయని
దృశ్యం.

మా వదినెకళ్ళు సంతృప్తితో మెరిశాయి. ఆడదాని
చేతిలో చలించిన నేను ఎప్పటికైనా తప్పక పెళ్ళి చేసుకుంటానని
ఆమెకు ధైర్యం కలిగిఉంటుంది

నేనుమాత్రం నిజంగా చాలా బాధపడ్డాను పరిస్థితులు
ఈ రూపం దాల్చినందుకు. కాని తప్పనిసరిగా, పెడదారి త్రొక్కిన
మనస్సుకు కళ్ళాలు బిగించి సావిత్రమ్మ విషయంలో ఒక్క
స్నేహమే పెంపొందింపచేయ దలుచుకున్నాను.

కాని ఆమె నిజవిషయం నాకు అర్థంకాలేదు. నా జీవి
తంలో యిప్పటివరకు నాకు కనిపించిన స్త్రీలు అర్థంకాక, నాకు
అసహ్యం కలిగించారు. కాని సావిత్రమ్మ నాకు జీవితానికి
సరిపడే మనోవ్యథ కలిగించింది. ఇంక నేను పెళ్ళి చేసుకో
దల్చుకోలేదు.